క్లుప్తంగా

అడ్మిషన్లు ప్రారంభం

ఏటూరునాగారం: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 2023 సెషన్ కోసం ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద వివిధ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్‌లకు శిక్షణ పొందేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఈనెల 17 నుంచి జూన్ 10 వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమాచారం కోసం 98493 89325, 82973 38888, 94904 56335 సంప్రదించాలన్నారు.

క్రీడాకారుడికి చేయూత



భూపాలపల్లి అర్బన్/భూపాలపల్లి రూరల్: మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన మండలంలోని గొర్లవీడు గ్రామానికి చెందిన తోట సాయిచరణ్ ఎంపికయ్యాడు. ఈ నెల 20 నుంచి 22వ తేది వరకు జరిగే అండర్ 16 క్రికెట్ పోటీలకు వెళ్లనున్నారు. దీంతో క్రీడాకారుడికి ఏకే హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయూతనందించారు. సాయిచరణ్‌ను సన్మానించిం ఆర్థిక సాయం చేశారు. అతడికి కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తామని భరోసానిచ్చారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కృష్ణ, రాము, లక్ష్మన్, ఇర్ఫాన్‌అలీలు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను ఏపీఓ గరి హరీష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలు చేపడుతున్న కందకాలు, చెరువు కూడికతీత పనులను సందర్శించి, పలు సూచనలు చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో రోజు కూలీ రూ.257 ఉండగా ప్రస్తుతం రూ.272కు పెంచడం జరిగిందన్నారు. నిర్ణయించిన కొలతల ప్రకారం పని చేస్తేనే రూ.272 ఖాతాలో పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రేగా శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్స్ మెడగాని రాజయ్య, బానోత్ కిరణ్ పాల్గొన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి



మహదేవపూర్: గ్రామంలో ఎవరైన కొత్త వ్యక్తులు అనుమానితంగా కనిపిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై రాజ్ కుమార్ అన్నారు. మండలంలోని రాపెల్లి కోటలో గురువారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. మావోయిస్టులకు ఎవరైనా సహకరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలోని యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి, గుట్కా, గుడుంబా, మద్యానికి బానిసలు కావద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సీవిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎస్‌ఎస్ తాడ్వాయి: చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సీతక్క

ఎస్‌ఎస్ తాడ్వాయి: పేదలు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సీతక్క, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి హాజరై లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ.. లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం జెడ్పీ వైస్ చైర్ పర్సన్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీపీ గొంది వాణిశ్రీ, వైస్ ఎంపీపీ పాక కాంత, ఏటూరునాగారం జీసీసీ డైరెక్టర్ పులసం పురుషోత్తం, సర్పంచులు కళ్యాణి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకాన్ని అర్హులైన తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో 46 కల్యాణలక్ష్మి, 6 షాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఆడ పిల్లలు భారం అనుకోకుండా మంచి చదువులు చదివించి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడే వరకు పెళ్లిళ్లు చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంతటివిజయ, జెడ్పీకోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, సర్పంచ్‌లు రామ్మూర్తి, దొడ్డ కృష్ణ, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీఓ కుమార్, ఎంపీటీసీ కుమ్మరి స్వప్న చంద్రబాబు, ఆర్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ములుగు రూరల్(గోవిందరావుపేట): నిరుపేద కుటుంబాల ఆడపడుచులకు ప్రభుత్వం పెళ్లి సమయంలో కల్యాణలక్ష్మి చెక్కులను అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. గురువారం గోవిందరావుట మండలకేంద్రంలో తహసీల్దార్ అల్లం రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. 59 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు ఏడుకొండలు, నాగలక్ష్మీఅనిల్‌యాదవ్, ఉమాదేవినరేందర్‌రెడ్డి, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

నివాళి..



గోవిందరావుపేటలో కోటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలకేంద్రానికి చెందిన చెన్న కోటయ్య, లక్ష్మీపురం గ్రామానికి చెందిన భరత్‌లు ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే సీతక్క గురువారం పరామర్శించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాంనాయక్, జంపాల ప్రభాకర్, శ్రీకాంత్, నాగేందర్‌రావు, పాలడుగు వెంకట క్రిష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, ఏడుకొండలు, అనిల్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సీతక్కకు వినతిపత్రం సమర్పిస్తున్న వీఆర్‌ఏలు

ఏటూరునాగారం: వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాన్ని చూపాలని ఎమ్మెల్యే సీతక్కను వీఆర్‌ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంపల శంకర్ వేడుకున్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి హాజరైన సీతక్కను వీఆర్‌ఏలు కలుసుకొని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. సమగ్ర కుటుంబ సర్వే, తెల్లరేషన్ కార్డులు, వరదల సమయంలో ప్రజలకు సాయం, హరితహారం తదితర కార్యక్రమాలను విజయవంతం కావడానికి నిరంతరం శ్రమించామన్నారు. పేస్కేల్ ఇవ్వాలని, సీనియార్టీ ప్రకారం జూనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పించాలని, 55 ఏళ్లు నిండిన వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. సమ్మెకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జబ్బ నగేష్, బత్తుల కృష్ణ, గద్దల కృష్ణకుఆరి, వెంకటయ్య పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో కలుపొద్దు

వెంకటాపురం(కె): ఎస్టీ జాబితాలో ఇతర కులాలను కలపొద్దని ఆదివాసీ సీనియర్ నాయకుడు పూనెం సాయి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం 11 కులాలను ఎస్టీ జాబితాలో కలుపుతూ ప్రవేశ పెట్టిన బిల్లును తక్షణమే రద్దు చేయాలన్నారు. ఓట్ల రాజకీయం కోసం 11 కులాలను ఎస్టీ జాబితాలో కులుపుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి కమిషన్ వేయకుండా పరిశీలన లేకుండా ఏకపక్షంగా ఎలా నిర్ణయం తీసుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో కలపడవం వల్ల ఆదివాసీల మనుగడ ప్రశ్నర్థకంగా మారిందని అన్నారు. ఇప్పటికైన బిల్లును రద్దు చేయాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని అన్నారు. ఈ సమావేశంలో మడకం రవి, మోహన్, పార్థు తదితరులు ఉన్నారు.

తపాలా సేవలను విస్తరించాలి



మాట్లాడుతున్న పోస్టల్ ఎస్పీ ప్రభాకర్

కాటారం: తపాలాశాఖ సేవలను ఇంటింటా విస్తరింపజేసి ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా చూడాలని పోస్టల్ ఎస్పీ పసునూరి ప్రభాకర్ జీడీఎస్ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలో గురువారం తపాలాశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తపాలాశాఖ సేవలు, అమలవుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోస్టల్ ఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ.. మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్స్ పథకంలో భాగంగా మహిళలకు అధిక సంఖ్యలో ఖాతాలు చేయించి ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవాలని తెలిపారు. తపాలాశాఖలో పలు పొదుపు పథకాలు ఉన్నాయని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. బడుగ, పేదవర్గాలకు అందుబాటులో ఉండే విధంగా గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీని కేవలం రూ.396కే అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. అనేక మంది పేద ప్రజలు ప్రైవేటు సంస్థల్లో పొదుపు చేసి నష్టపోతున్నారని ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రచారం చేసి తపాలా శాఖపై నమ్మకం కల్గించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో మంథని సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ అజరుద్దిన్, మెయిల్ ఓర్షల్ బుర్రి శ్రీనివాస్, గ్రామీణ బ్యాంక్ డివిజన్ అధ్యక్షుడు కుడుదుల కిష్టయ్య, బీపీఎంలు మల్లయ్య, మురళి, పుల్లారెడ్డి, సురేశ్‌రెడ్డి, గోపాల్, శ్రీరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న ఐటీడీఏ పీఓ అంకిత్

వెంకటాపురం(ఎం): మండలంలోని జవహర్‌నగర్ గ్రామానికి చెందిన, ఏటూరునాగారం ఐటీడీఏ మేనేజర్ గా పనిచేస్తున్న భూక్యా లాల్‌నాయక్ తండ్రి రమణానాయక్(85) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, లాల్‌నాయక్ తల్లి భూక్యా రుక్మాబాయి(75) మృతి చెందిన మూడవ రోజే తండ్రి మృతి చెందడంతో కుటుంబంలో విషాదచాయలు నెలకొన్నాయి. బాధిత కుటుంబాన్ని ఐటీడీఏ పీవో అంకిత్ గురువారం పరామర్శించి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా బాధితుడి కుటుంబాన్ని మాజీ ఎంపీ సీతారాం నాయక్ పరామర్శించారు.

బండి సంజయ్‌కి వినతి

కాటారం: ఐకేపీ వీఓఏల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంథని నియోజకవర్గానికి చెందిన పలువురు వీఓఏలు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సంజయ్‌కి విన్నవించారు. తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. దీంతో స్పందించిన బండి సంజయ్ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. వీఓఏలతో పాటు ఎంపీటీసీ విజయరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆత్మ చైర్మన్ రమణయ్యకు..



పరామర్శిస్తున్న నాగరమేష్

ఎస్‌ఎస్‌తాడ్వాయి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్యను శ్రీరామ సేవ ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగరమేష్ గురువారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గాయం నుంచి త్వరగా కొలుకోవాలని ఆకాక్షించారు. ఆయన వెంట ఆదివాసీ సంఘం నాయకులు గౌరబోయిన మోహన్‌రావు, ట్రస్ట్ సభ్యులు ఆదినారాయణ, నవీన్, చౌలం వేణు, ప్రవీణ్, మహేశ్, జయరాజు ఉన్నారు.

వైన్ షాపుల నిలువు దోపిడీ!

- ఎమ్మార్పీకి విక్రయించని మద్యం
- రేట్లు తగ్గినా పాత ధరలకే అమ్మకం



మొగుళ్లపల్లి: మండల వ్యాప్తంగా ఉన్న రెండు వైన్ షాపుల్లో అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తూ మందు బాబులను నిలువున దోపిడి చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు షాపులు సిండికేట్‌గా మారి ఓ షాపు ఓల్‌సెల్‌గా మరో షాపు రిటేల్‌గా ఒప్పదం చేసుకొని విక్రయాలు చేస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఓల్‌సెల్ షాపులో కేవలం బెల్టు షాపులకే మద్యాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో మద్యం బాటిల్‌కు సుమారు రూ.80 నుంచి రూ.200 వరకు అధిక ధరలకు విక్రయాలు జరుపుతున్నారు. మందుబాబులు ఈ విషయాన్ని బహిరంగాగా విమర్శించిన అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

రూ.లక్షల్లో వ్యాపారం..

గ్రామాల్లోని బెల్టు షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్న ఓల్‌సెల్ షాపులో ప్రతి రోజు రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతుంది. నిత్యం గ్రామాల్లోని మందు బాబుల వ్యసనమే లక్ష్యంగా అమ్మకాలు నిర్వహిస్తున్నారు. మందుబాబులు అధిక ధరలు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. దీంతో వారి డబ్బులు వృథా అవడమే కాకుండా అనారోగ్య పాలవుతున్నారు. ఉదయం లేచిన నుంచి యువకులు మద్యానికి బానిసలుగా మారుతున్నారు. గ్రామాల్లోని 24 గంటల మద్యం లభిస్తుందని చెప్పడంలో ఆశ్చర్యం లేదు. ఈ దుకాణలపై చర్యలు తీసుకోవాలని మహిళ సంఘాలు స్వచ్ఛంద సంస్థలు నిరసనలు చేస్తున్న ఫలితం లేకుండా పోతుంది. సంబంధిత అధికారులు కనీసం అంటూ వైపుగా చూడటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

యాప్‌లో ఓ ధర.. బాటిళ్లపై పై మరో ధర

అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న షాపుల యాజమానుల మోసన్ని గ్రహించిన ప్రభుత్వం తెలంగాణ స్టేట్ లిక్కర్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇటీవల మండలంలోని ఓ గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు వచ్చిన ఓ యువకుడు మద్యం షాపులో జరుగుతున్న మోసన్ని గ్రహించాడు. తన మొబైల్‌లో ఉన్న యాప్ ద్వారా మద్యం బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేశాడు. దీంతో యాప్‌లో రూ.300 చూపించగా సీసాపై రూ.320 ఉంది. దీంతో ఆశ్చర్యానికి గురైన యువకుడు యాప్‌లో ఓ ధర బాటిల్‌పై మరో ధర ఉండటం ఏంటని దుకాణ యాజమాన్ని ప్రశ్నించాడు. అయినా వారి నుంచి ఎలాంటి సమాదానం రాలేదు. ప్రభుత్వం ధరలు తగ్గించిన్నాప్పటికీ పాత ధరలనే తీసుకుంటూ మందు బాబులను మోసం చేస్తున్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మద్యం షాపుల యాజమానులకు సహకరిస్తున్నారని మందుబాబులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మోసాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



మాట్లాడుతున్న ఏడీఏ శ్రీధర్

కన్నాయిగూడెం: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏటూరునాగారం ఏడీఏ శ్రీధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తనాలు, ఎరువులు విక్రయించే డీలర్లకు మండల వ్యవసాయ అధికారి జేసింగ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఏడీఏ శ్రీధర్ మాట్లాడుతూ.. మండలంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించే డీలర్లు నాణ్యతతో కూడిన సరుకులనే అమ్మాలని అన్నారు. నకిలి విత్తనాలు ఎరువులు అమ్మినట్లయితే పీడీ యాక్టు కేసు నమోదు చేసి డిలర్‌షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సై సురేష్, డీలర్లు తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలపై దృష్టి పెట్టాలి



ఎస్సైని సన్మానిస్తున్న సర్పంచ్ రామ్మూర్తి

ఏటూరునాగారం: మేజర్ గ్రామ పంచాయతీ ఏటూరునాగారం గ్రామంలో శాంతిభద్రతలపై దృష్టి పెట్టాలని స్థానిక సర్పంచ్ ఈసం రామ్మూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలను చేపట్టి ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్‌ను సర్పంచ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ మాదరి రామయ్య, రామన్నగూడెం సర్పంచ్ దొడ్డ కృష్ణ, కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆయూబ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



భూపాలపల్లి రూరల్: అవగాహన కల్పిస్తున్న పోలీసులు



టేకుమట్లలో..

భూపాలపల్లి రూరల్: మహిళలు సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ సూచించారు. జిల్లా కేంద్రంలో గురువారం అంగడిసెంటర్‌లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తదితర అంశాలపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, పోలీసులు శ్యామల, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: వేసవిలో రైతులు తగు జాగ్రత్తలు పాటించి ఎండ నుంచి రక్షణ పొందాలని హెడ్ కానిస్టేబల్ వర్టికల్ ఇన్‌చార్జ్ తుల రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు వేసవి జాగ్రత్తలు, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి కావున రైతులు కల్లాల్లో ఉదయం సాయంత్రం మాత్రమే పనులు చేసుకోవాలన్నారు. అలాగే రైతుల ఖాతాల్లో నగదు జమ కానున్న సందర్భంగా సైబర్ నేరగాళ్లు రైతులను లక్ష్యంగా చేసుకుని మోసం చేస్తారని, కావున అనుమానిత వ్యక్తుల కాల్స్‌కు స్పందించరాదని, ఎలాంటి ఓటీపీలు, మెసేజ్‌లకు స్పందించరాదని సూచించారు. వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడుపాలని, అత్యవసర సమయంలో డయల్ 100కి కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుల్‌లు మధూకర్, మహేందర్, హర్షితారెడ్డి, లత, తదితరులు ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకం పారబోస్తున్న ఎస్సై మాన్‌సింగ్

చిట్యాల: మండలంలోని బావుసింగ్‌పల్లి గ్రామంలో గుడుంబా తయారు చేస్తున్న కేంద్రాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సమాచారం మేరకు బావుసింగ్‌పల్లి గ్రామంలో దాడులు చేపట్టి 12లీటర్ల గుడుంబా, 250లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే 20 లీటర్ల పటిక బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు గుడుంబా తయారు చేస్తున్న శ్రీనివాస్, రవీందర్, సమ్మయ్య, మొగిలి, నరేష్, సమ్మయ్యలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆరుగురి వ్యక్తులను చిట్యాల తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామని సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్సై మాన్‌సింగ్, కానిస్టెబుళ్లు బాలకృష్ణ విజయ్ కుమార్, అలీ, ముజాఫర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



మల్హర్: పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

మహాముత్తారం: ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య ప్రణాళికలో భాగంగా గురువారం మహాముత్తారం, నల్లగుంటమీనాజీపేట, వజినేపల్లి గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఆయా గ్రామ పంచాయతీల్లోని వార్డుల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతోపాటు కాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డులకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వేణుగోపాల్, ప్రవీన్‌రాజ్, పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

మల్హర్: ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య ప్రణాళికలో భాగంగా మండలంలోని వల్లెకుంట, మల్లారం గ్రామంలో పంచాయతీ సిబ్బంది గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది రోడ్డులను శుభ్రం చేసి, రోడ్లుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను, పొదలను తొలగించారు. అలాగే ప్రభుత్వ భవనాలు పరిశుభ్రం చేయడం, నీరు నిల్వ ఉండే ప్రాంతాలను మొరంతో నింపారు. సర్పంచ్‌లు రమేష్, పద్మ శ్రీనివాస్, కార్యదర్శులు నరేష్, రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ సుంకు రాము, వార్డు సభ్యులు శ్రీధర్, రాజన్న, రవీందర్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

కాటారం: సర్పంచ్‌గా పదవి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామ అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, పాలకవర్గం సహకారంతో ముందుకెళ్తున్నట్లు కాటారం సర్పంచ్ తోట రాధమ్మ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో పలు సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలతో పాటు పలు అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీరాకేశ్ సహకారంతో అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడకుండా ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

ములుగు: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలోని చెట్టు కింద గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఈ మేరకు స్థానికులు పోలసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మృత దేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన మహిళ వయస్సు సూమారు 56 ఉంటుందని సంబంధిత వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్ నంబర్ 87126 70082ను సంప్రదించాలని ఎస్సై పవన్‌కుమార్ సూచించారు. ఆస్పత్రిలో మృతదేహాన్ని భద్రపరిచినట్లు తెలిపారు.